# సినీ బేతాళ కథలు

## - డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగువైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

### - 5 -

### ద్రౌపదీ వస్త్రాపహరణం

**బేతాళుడి** శవాన్ని మళ్ళీ తన భుజం మీద వేసుకుని, విక్రమార్కుడు నడకసాగించాడు.

'విక్రమార్కా! నీకు శ్రమ కలుగకుండా ఉండేందుకు మళ్ళా మరో కథ చెబుతాను, విను.' అని బేతాళుడు ప్రారంభించాడు.

'విజయా చక్రపాణిగారు అప్పుడప్పుడు మాట్లాడినా గొప్ప సత్యాలు చమత్కారాలై దొర్లేవి. అడపాదడపా నిర్మాతలు ఆయన్ని సలహాలు అడిగేవారు. ఓసారి ఒక నిర్మాత, చక్రపాణిగారి దగ్గరకు వెళ్ళి, 'సార్! సామర్లకోటనుంచి వేషం కోసం ఒక నటుడొచ్చాడు. అతని కళ్ళూ, ముక్కూ, హెయిర్‌స్టయిలూ, పెర్సనాలిటీ అన్నీ యన్టీరామారావుకి లాగా ఉన్నాయండి. అసలాయన యన్టీఆర్ లాగే ఉన్నాడండి. ఆయనే యన్టీఆర్ అంటే నమ్మేస్తారండి' అన్నాడు.

వెంటనే చక్రపాణిగారు, 'అంతా ఆడిలా ఉంటే ఈడెందుకు? ఆణ్ణే పెట్టుకుంటే పోలా!' అని బదులిచ్చారు.

మరోసారి మరో నిర్మాత 'సార్' ఏ సినిమా తీసినా ప్రేక్షకుడికి ఒక మంచి నీతి చెప్పాలనుంది సార్ అన్నాడు. 'చూసేవోడు సినిమా మనోల్లాసం కోసం చూస్తాడు. అంతగా నీతులు కావాలంటే, పక్క వీధిలో హరిదాసు చెప్పే హరికథకెళ్ళమను. ఆడుబోల్డు నీతులు చెప్తాడు' అని బదులిచ్చారు చక్రపాణిగారు.

ఇంకోసారి చుక్కా చిదంబరం అనే నిర్మాత తను తియ్యబోయే కొత్తసినిమా సబ్జెక్ట్ గురించి, సలహా అడిగాడు. 'కొత్తాడివి కదా! ఏదన్నా పౌరాణికం చూసుకో. ఆ కథలు ఎప్పుడూ ఒకేనే గనక, సరైన కథ జూసుకుని సరైనోళ్ళ చేత చేయించుకుంటే సేఫుగా నిలబడతావ్' అని ఉపదేశించి పంపారు చక్రపాణిగారు.

చుక్కా చిదంబరానికి సాయంత్రం ఓ చుక్కపడితేగానీ మెదడు పనిచేయదు. అంచేత ఒక రోజు సూర్యాస్తమయం దాటాక బాటిల్ ఓపెన్ చేసి పౌరాణిక సబ్జెక్టులన్నీ బుర్రలో వెదుక్కున్నాడు. అసంఖ్యాకమైన పౌరాణికాలతో బుర్ర వాచిపోయింది. అసిస్టెంటు

జంబులింగాన్ని పిలిచి కూర్చోమని సలహా అడిగాడు. అంతకు ముందు జంబులింగం కొన్ని పౌరాణికాలకు పనిచేశాడు. రకరకాల పేర్లు ఏకరువు పెట్టాడు. పేర్లన్నీ విని చుక్కా చిదంబరం –

‘అన్ని సబ్జక్టులూ బాగానే ఉన్నాయి జంబూ! అయితే చాలా వాటికి సెట్టింగ్స్‌కీ, కాస్ట్యూమ్స్‌కీ, మేకప్‌కీ, బడ్జెట్ బాగా పెరిగిపోయేలా ఉంది. బాలన్స్ అవ్వాలంటే కాస్త సెక్స్ ఎలిమెంట్ కూడా ఉండాలి. భక్తీ రక్తీ కలిపితే ప్రేక్షకుడు కూడా విరగబడి చూస్తారు –‘ అన్నాడు.

‘సతీ అనసూయ తియ్యొచ్చు – కానీ ఈ మధ్యనే రెండు వెర్షన్స్ తీసేసారు. ఇంకేదన్నా అయితే బెటరు. ‘

‘ ఆః – అన్నట్టు ‘ద్రౌపదీ వస్త్రాపహరణం‘ ఎన్నో ఏళ్ళుగా ఎవరూ తీయలేదు. ‘

‘వెరీగుడ్! ద్రౌపదీ వస్త్రాపరణం బెస్టు. అయితే రేపే వర్క్ స్టార్ట్ చేద్దాం.‘

‘ద్రౌపదిగా ఎవరైతే సరిపోతారు?‘

‘ద్రౌపది పాత్రకు ఎవరో ఒకరు దొరుకుతారు.....‘

‘బొంబాయి భామలు మనకి అలవాటేకదా! మన హీరోయిన్స్ మనకి పనికిరారు. బోంబే బొమ్మలే కావాలి జంబూ, పంచదారకంటే పరదార తీపి‘ అని ఎప్పుడో చెప్పారు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు.

‘సత్యం పలికారు. ఎప్పుడూ పొరుగింటి పిల్ల కూరే కదా మనకి టేస్టీ. ఐన్‌స్టీన్ ఓకే అన్నాడు కాబట్టి శ్రీమత్ భగవద్గీత గ్రేటు. మెక్డొనాల్డ్స్ వాడు ఇడ్లీ వెయ్యిరూపాయలన్నా ఛీపు రేటు.‘

‘ఇంతకీ నార్తులో ఎవరెవరున్నారు హీరోయిన్లు?‘

‘ఒకరేంటి! ఒకర్ని మించిన వాళ్ళొకరు – కామాక్షీ సిన్హా, రేఖాగుప్తా, తారాసెట్టి, తృప్తీ భట్నాగర్, మాధురీ వైశంపాయన్, మగతాదీక్షిత్, మలయా అగ్నిహోత్రి, హమేషా అవధాని, సోనాలీ సోమయాజి..‘

‘ఆపు ఇంక. ద్రౌపది సకలలోక సౌందర్యవతి. మిస్ యూనివర్సని మన ఇతిహాసాలు చెప్పాయి. నువ్వు చెప్పిన లిస్టులో పిటపిటలాడుతూ ప్రేక్షకుణ్ణి ఫట్‌ఫట్‌లాండించే అందగత్తె ఎవరు జంబూ?‘

‘అందరూ అందగత్తెలే చిదంబరం. అయితే హమ్‌షా అవధాని, సోనాలీ సోమయాజి మాత్రం మొత్తం వీళ్ళందరిలో మాంచి కంజాయింపుగా ఉంటారు.‘

‘తెలుగొచ్చా?‘

‘మన ప్రొడ్యూసర్లు అప్పుడప్పుడు టచ్‌లో ఉంటారు కనుక ఏదో కొంచెం వచ్చు. అయినా డబ్బింగు పెట్టేసుకుంటాం గదా! ఇప్పుడు జగ్గయ్యగారు బతికొచ్చినా ఆయనక్కూడా డబ్బింగ్ పెట్టే లెవెల్లో సెట్ అయ్యాం మనం.‘

‘కరెక్ట్!‘

‘అయినా ద్రౌపదికి వస్త్రాపరణం చేస్తుంటే డైలాగులెవడు వింటాడు. విన్నా – కృష్ణా! అన్న పిలుపేకదా! అన్ని భాషల్లోనూ కృష్ణా – కృష్ణా!యే కదా!. అయినా మాంచి సాంగోటేస్తాం గదా!‘

‘అన్నట్టు జంబూ.. ద్రౌపది సరే, మన పిక్చర్‌కి చీర్లు చాలా కావాలికదా! మనం సీర్లు చెప్పుకుంటూ కాలయాపన చైకుండా ముందు చీర్ల సంగతి చూడాలి. ‘

వారం తర్వాత మళ్ళా నిర్మాత చుక్కాచిదంబరం, అతని అసిస్టెంట్ ఫ్రెండ్ జంబులింగం కూర్చున్నారు. జంబు సీర్లు అన్నాడు. చిదంబరం చీరలు? అన్నాడు.

జంబులింగం.. 'చిదంబరం! మనం అసలు ఈ ద్రౌపదీ వస్త్రాపహరణం తియ్యగలమా? అనిపిస్తోంది' అన్నాడు.

చుక్కా చిదంబరం 'ఏం అలా అంటున్నావ్?' అనడిగాడు.

జంబు చెప్పాడు - 'చీర్లెక్కడా దొరకడంలేదు. ఎలాగో తంటాలుపడి ఒక చీర్ల షాపువాడ్ని పట్టుకున్నాను. కానీ వాడి షాపంతా ఖాళీ. నీ బిజినెస్సే బావుందోయ్ అని మెచ్చుకున్నాను. దానికి వాడు 'జోకులెయ్యకండిసార్! దివాళా చాలా అయిపోయాను. చీర్లమ్మకం బాగా పడిపోయింది. సినిమాకోసం ప్రొడ్యూసర్లు నా దగ్గర చీరలు అద్దెకు తీసుకుని షూటింగయ్యాక తిరిగిస్తారు. వాటిని మళ్ళీ జాగర్తగా మడతబెట్టి అమ్ముకునేవాణ్ని. కానీ ఆ ప్రొడ్యూసరెవడో తెల్దు. ఆర్నెల్లకితం నా దగ్గర కాస్ట్లీ చీర్లన్నీ అద్దెకు తీసుకెళ్ళి ఇంతవరకూ కనబడలేదు. మీరేదో వస్త్రాపహరణం సినిమా తీస్తానంటున్నారు కానీ నాకు నిజంగా వస్త్రాపహరణం అయిపోయింది. నన్నొదిలెయ్యండి సార్ -' అని నాకాళ్ళ మీదపడి నేను వేసుకున్నది ట్రౌజరో, చీరో చెక్ చేస్తూ లేవకుండా అలాగే నిద్రపోయాడు.'

'పోనీ ఇంకెక్కడేనా ట్రై చెయ్యకపోయావా?' అడిగాడు చిదంబరం.

'ఎక్కడని ట్రై చేసేది. పెళ్ళిళ్ళకి తప్ప చీరల వాడకం బాగా తగ్గిపోయింది. బజార్లన్నీ తిరిగితే అడవిలో నెమలికన్నులా అక్కడో చీరా, అక్కడో చీరా కనబడుతోంది. ఒక చీర కట్టుకున్నావిడని, 'ఈ మీ చీర ఎక్కడ కొన్నారమ్మా! ' అని అడిగాను. 'సచ్చినాడా' అంది. ముందు కాకినాడలా అదో ఊరనుకున్నాను. తర్వాత తెలిసింది ఆవిడ తిట్టిందని. మరొకావిడని అడిగితే, 'లాస్ఏంజెలిస్' అంది, ఇంకో ఆవిడ "చిగాగో" అంది. మరో స్త్రీ 'లండన్' అంది. అంతాకూడా చీరేకాదు, మేమూ అక్కణ్నించే వచ్చాం అన్నారు. సో - చిదంబరం. చీర చూపించడానికేనా మనం ద్రౌపదీ వస్త్రాపహరణ సినిమా తియ్యక తప్పదు.' అన్నాడు జంబులింగం.

'సరే అయితే - మీ ఇంట్లో చీర నువు తీసుకురా, మా ఇంట్లోది నేను తెస్తాను. ఈలోగా ఆ బొంబాయి పిల్ల హమేషా అవధానిని పిలిపించు' అన్నాడు చిదంబరం.

హమేషా అవధానిని హయాత్ రీజెన్సీలో దింపారు. 'ఫ్లైట్ ఫస్ట్‌క్లాసులో ఎక్కించారు. బాగా టైరయిపోయాను. ఇవాళ రెస్ట్. కల్ ఆవ్!' అంది జంబులింగంతో.

మర్నాడు. 'ఇంతకీ నా వేషం ఏవిటీ?' అని హిందీలో అడిగింది.

జంబు 'మీరు ద్రౌపది. నలుగురు విలన్స్‌లో ఒక విలన్ మీ చీర విప్పేయడానికి ట్రైచేస్తాడు.'

'చీర విప్పుతాడా?'

'పూర్తిగా విప్పడు. జస్ట్ ట్రైస్'

'నేనసలు చీరే కట్టుకోను కదా ఏం విప్పుతాడు? వాడి చీర వాణ్ణేకట్టుకుని విప్పుకోమను. '

'కథ వొప్పుకోదమ్మా'

'కథా, యూమీన్ కహానీ - ఏంటీ కహానీలు చెప్తున్నావా? - ఐయామ్ ఫ్రమ్ బాలీవుడ్, మేం అసలు చీరేకాదు - ఏ బట్టలూ వేసుకోం జస్ట్ బ్రీఫ్స్ - దట్సాల్'

'ఆ పని షూటింగయ్యాక నిర్మాతగారు కారు పంపాక చెయ్యొచ్చమ్మా'

'నాన్సెన్స్ - ఫస్ట్‌క్లాస్ ఫ్లైట్, ఫైవ్ స్టార్ హోటల్, మగర్ పైసా నహీ - ఐ హేట్ సౌత్ ప్రొడ్యూసర్స్' అని ఆ మర్నాడే బోంబేకి ఎగిరిపోయింది హమేషా అవధాని.

'ఇది మనకి మామూలే - మరి ఆ సోనాలీ సోమయాజిని పిలు' అన్నాడు జంబులింగంతో చిదంబరం.

సోనాలీ సోమయాజికి ముందు సీనేమిటో చెప్పకుండా స్టూడియోకి తీసుకెళ్ళారు. మేకప్ అయాక చీరకట్టబోతే నో - అని సెట్లోకి వచ్చేసింది. అర్ధంన్నర పావు నగ్నంగా ఉన్న సోనాలీ సోమయాజిని చూసి దుర్యోధన, శకుని, కర్ణులు - తాము దుశ్శాసన పాత్ర

వేసుంటే బాగుండేది అని వాపోయారు. దుశ్శాసన వేషధారి - 'డ్రెస్సు బలేవుంది. వేరీజ్‌ది రెస్ట్?' అనడిగాడు - కాస్ట్యూమ్ కుర్రాడు, కుర్రది వచ్చి బోంబే సోమయాజికి చీర కట్టే ప్రయత్నంచేయబోయారు. సడెన్‌గా పవర్ కట్ మూలంగా కరెంట్ పోయి లైట్సన్నీ ఆరిపోయాయి. మళ్ళీ కొద్దిసేపటికే పవర్ వచ్చి వైట్లన్నీ వెలిగాయి.

- అదీ విక్రమార్కా! - ఇప్పుడు చెప్పు. లైట్లు వెలిగాక 'ద్రౌపదీ వస్త్రాపహరణం 'చిత్రం షూటింగ్ తర్వాత ఎలా నడిచింది? సినిమా పూర్తయ్యిందా? రిలీజయిందా? హిట్టయిందా? నిర్మాత చుక్కా చిదంబరం, అతని మిత్ర సహాయకుడు జంబులింగం ఎలాంటి ఫలితాన్ని చవిచూశారు? - ఈ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోతే నీ తల అర్జంటుగా బట్టతలైపోయి, విగ్గుపెట్టుకుని దురద వేస్తే గోక్కోలేక అవస్థపడాల్సి వస్తుంది.' అని ముగించాడు బేతాళుడు.

అంతా విన్న విక్రమార్కుడు 'బేతాళా! బోంబే తార సోనాలీ సోమయాజికి కూడా చీర కట్టుకునే అలవాటూలేదు, ఇష్టమూ లేదు. చీరకట్టబోతుంటే ద్రౌపది పాత్రధారిణి సోమయాజి, అగ్నిహోత్రావధానైపోయింది. కోపంతో వెంటనే దుష్టచతుష్టయం మీద దాడి చేసింది. దుర్యోధనుడికీ, దుశ్శాసనుడికీ శకుని కర్ణులకూ పంచెలూడదీసి, రత్నాల్లా మెరిసే గాజుముక్కలతికించిన వారి టీ షర్ట్సు ముక్కముక్కలుగా చింపేసి వాళ్ళ మొహాన్న కొట్టి విసవిసా సెట్లోంచి నిష్క్రమించింది. ద్రౌపదికి బదులు దుష్టచతుష్టయానికి వస్త్రాపహరణం జరిగిపోయింది. వారిశీలాన్ని రక్షించే శ్రీకృష్ణుడు ఏడీ వారికి? లేడుగా మరి! - కట్ చేస్తే, కిరీటాలు ధరించి, ఒంటిమీద ఏ ఆచ్ఛాదనా లేకుండా కేవలం బ్రీఫ్స్ భరిస్తూ దిగంబరులైన దుష్టచతుష్టయ పాత్రధారులు అదే ఫ్రేములో ఆబ్సెంటయిన జంబులింగం, నిర్మాత చుక్కా చిదంబరం. నలుగురు విలన్ పాత్రధారులూ చిదంబరం రెండు దవడలు ఎడాపెడా ఒక అరగంట వాయించేశారు. అలా వాయించబడిన నిర్మాతగారి దవడలు గవజ బిళ్ళలు కట్టినట్టు వాచిపోయాయి. దుష్టచతుష్టయం వెళ్ళిపోయాక, చుక్కా చిదంబరం డాబా యెక్కి నోట్లో కాస్త చుక్క వేసుకున్నాడు నొప్పి భరించలేక. అలా చుక్క సేవిస్తూ తలెత్తి పైకి చూస్తే, చిదంబరానికి అంబరంలో పరుచుకున్న చుక్కలన్నీ వెక్కిరిస్తున్నట్టు వెలిగాయి. నాకెటు చూసినా చుక్కెదురే అని విలపించాడు నిర్మాత చుక్కా చిదంబరం.

ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః మధ్యే తిష్ఠంతి రాజసాః !

జఘున్యగుణవృత్తిస్థాః అధో గచ్ఛంతి తామసాః !!

దారులు వేరైతే గమ్యం ఒకటెలా అవుతుంది? -

అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు" అని విక్రమార్కుడు బదులుచెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి బేతాళుడు ఎగిరి మళ్ళీ చెట్టెక్కేశాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments